నమస్తే తెలంగాణ
జోగులాంబ గద్వాల
వనపర్తి
5 | మహబూబ్‌నగర్, మంగళవారం 8 ఏప్రిల్ 2025 | JOGULAMBA GADWAL WANAPARTHY

# కేసీఆర్ అవసరాన్ని ప్రజలు గుర్తించారు



సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

- **ప్రజాసంక్షేమమే లక్ష్యంగా పదేండ్ల బీఆర్‌ఎస్ పాలన కొనసాగింది**
- **రజతోత్సవ సన్నాహక సమావేశంలో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి**

వనపర్తి, ఏప్రిల్ 7 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ పార్టీ అస్తవ్యస్త పరిపాలనలో కేసీఆర్ అవసరాన్ని అతి తక్కువ సమయంలోనే రాష్ట్ర ప్రజలు గుర్తించారని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఏప్రిల్ 27న వరంగల్‌లో జరుగనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను విజయవంతం కోసం సోమవారం వనపర్తి జిల్లా కేంద్రంలో కార్యకర్తల సన్నాహక సమావేశం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్ అధ్యక్షతన కొనసాగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో స్వపరిపాలన, స్వేచ్ఛ తొలి సీఎం కేసీఆర్ వల్లే సిద్ధించాయన్నారు. రాష్ట్ర ఏర్పాటు అనంతరం బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పదేండ్లు పాలన కొనసాగిందన్నారు. కొంత మంది కుట్రలు, కుతంత్రాల వల్ల అధికారం కోల్పోయినా ప్రజల్లో ఇప్పటికీ కేసీఆర్‌పై ఏమాత్రం అభిమానం తగ్గలేదని గుర్తు చేశారు. అధికార కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందుకు అనేక హామీలు ఇచ్చినా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆ హామీలు అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. దీంతో కేసీఆర్ ప్రాధాన్యత, బీఆర్‌ఎస్ అవసరం ప్రజలకు తక్కువ సమయంలోనే తెలిసి వచ్చిందన్నారు. త్వరలో పార్టీకి పూర్వ వైభవం వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అందులో భాగంగా నిర్వహించే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు ప్రజలను పెద్ద ఎత్తున సమీకరించాలని, ఈ మేరకు గ్రామాల్లో సభలు, సమావేశాలు నిర్వహించడంతోపాటు జెండావిష్కరణ కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు రైతు బంధు, రుణ మాఫీ, రైతు భరోసా, మహిళలకు రూ.2500, తులం బంగారం, నిరుద్యోగ భృతిలాంటి ఎన్నో పథకాలు అమలు చేయని పరిస్థితిని ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, పట్టణ అధ్యక్షుడు రమేశ్‌గౌడ్, మీడియా కన్వీనర్ అశోక్, కురుమూర్తియాదవ్, కృష్ణానాయక్, లక్ష్మారెడ్డి, కర్రెస్వామి, తిరుమల్, ప్రేమ్‌నాథ్‌రెడ్డి, గిరి, రాము, సునీల్, విజయ్‌కుమార్, దిలీప్ రెడ్డి, రాళ్ల కృష్ణయ్య, మాణిక్యం, వేణు, శారద, నాగమ్మ, కవిత, సాయిలీల తదితరులు పాల్గొన్నారు.

# అరాచక పాలనను అంతమొందించాలి



అచ్చంపేటలో కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

- **బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను జయప్రదం చేద్దాం**
- **అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు**

అచ్చంపేట (అమ్రాబాద్), ఏప్రిల్ 7 : రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అరాచక పాలన కొనసాగిస్తుందని అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు అన్నారు. కాంగ్రెస్ నేతలు ప్రజలను మా వద్దకు వస్తే ఏం తెస్తారు మీ వద్దకు వస్తే ఏమి ఇస్తారు అన్న చందంగా పాలనను సాగిస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. సోమవారం అచ్చంపేటలోని తన నివాసంలో అచ్చంపేట నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ అన్ని మండలాల నాయకులు, కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడ చూసినా తాగునీరు, సాగునీరు సమస్యలతో ప్రజలు, రైతన్నలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేలు ప్రజలకు క్యాంప్ కార్యాలయాల్లో అందుబాటులో లేరని ఆరోపించారు. బీఆర్‌ఎస్ హయాంలో కేసీఆర్ పాలనలో తాము ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉన్నామని ప్రజలతో క్యాంప్ కార్యాలయాలు కిటకిటలాడేవని ఆయన తెలిపారు. ఈ నెల 27వ తేదీన వరంగల్ ఎలుకతుర్తి గ్రామంలో నిర్వహించే బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భావ రజతోత్సవ సభను జయప్రదం చేద్దామని కార్యకర్తలు, నాయకులకు దిశానిర్దేశం చేశారు. నాడు తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రత్యేక ఉద్యమం చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన గొప్ప నాయకుడు మన కేసీఆర్ అని తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత అన్ని విధాలుగా మన రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలిచారని ఆయన గుర్తుచేశారు. ఉమామహేశ్వర లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును తీసుకొస్తే ఇప్పటివరకు తట్టెడు మట్టి కూడా తీయని పరిస్థితి కాంగ్రెస్ పార్టీది, స్థానిక ఎమ్మెల్యేదీ అని ఆయన అన్నారు. రాబోయే స్థానిక ఎలక్షన్స్‌లో ముఖ్యమంత్రి సొంత గ్రామం నుంచి బీఆర్‌ఎస్ పార్టీ గెలుస్తుందని అక్కడి నుంచే గెలుపును ప్రారంభిస్తామని అన్నారు. కార్యకర్తలు ఎవరు కేసులకు భయపడకండని మీకు అంతా నేను, బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందని ధైర్యం కల్పించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ఎడ్ల నర్సింహగౌడ్, సీనియర్ నాయకులు అమీనొద్దీన్, కేటీ తిరుపతయ్య, అచ్చంపేట పీఏసీసీఎస్ చైర్మన్ మందా రాజిరెడ్డి, నాయకులు రాంబాబునాయక్, కరుణాకర్‌రావు, నాగరాజు, కొత్త రవీందర్‌రావు, గణేశ్‌రావు, భూపాల్‌రావు, కుత్బుద్దీన్, అంజి, చెన్నకేశవులు పాల్గొన్నారు.

# స్తంభించిన మొక్కజొన్న విక్రయాలు

- **టెండర్లను నిలిపివేసిన ట్రేడర్స్**
- **బాదేపల్లి మార్కెట్‌లో రైతుల ఆందోళన**
- **ఆలస్యంగా మొదలైన ప్రక్రియ**

జడ్చర్లటౌన్, ఏప్రిల్ 7 : బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌యార్డులో సోమవారం మొక్కజొన్న విక్రయాలు స్తంభించాయి. బస్తా తూకం బరువు పెంచాలంటూ ట్రేడర్లు టెండర్లు వేయకుండా టెండర్ల ప్రక్రియను నిలిపివేశారు. మధ్యాహ్నం ఒంటిగంట వరకు సైతం టెండర్ల ప్రక్రియ మొదలుకాకపోవటంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. ఆకాల వర్షం వస్తే తమ పరిస్థితి ఏమిటని రైతులు మార్కెట్‌యార్డు కార్యాలయం ఆందోళన చేశారు. బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డుకు సోమవారం 4,500 క్వింటాళ్ల మొక్కజొన్న విక్రయానికి వచ్చింది. దాదాపు 120మంది రైతులు మొక్కజొన్న పంటను అమ్మేందుకు మార్కెట్‌కు రాగా, ఒక్కసారిగా ట్రేడర్స్ టెండర్లను వేయకుండా నిలిపివేయటంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. బస్తాకు 1300 గ్రాములు అధికంగా తూకం వేస్తేనే టెండర్లు వేస్తామని ట్రేడర్స్ భీష్మించుకొని కూర్చున్నారు. ఇప్పటికే బస్తాకు 49కిలోలు మాత్రమే తూకం వేస్తుండగా అదనంగా 1300 గ్రాములు తూకం వేయటం ఏమిటని రైతులు మండిపడ్డారు. ఈ తరుణంలో ఓ వైపు ట్రేడర్స్, రైతుల ఆందోళనతో మార్కెట్‌యార్డులో ఎక్కడికక్కడ మొక్కజొన్న టెండర్ల ప్రక్రియ ఆగిపోయింది. ఈ విషయాన్ని పలువురు స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని పాలకవర్గ సభ్యులకు ఎమ్మెల్యే సూచించటంతో పాలకవర్గసభ్యులు, మార్కెట్ కార్యదర్శి నవీన్ అక్కడికి చేరుకొని ట్రేడర్స్, రైతులతో మాట్లాడారు. తూకానికి సంబంధించి ఏదైనా ఉంటే చర్చించి చర్యలు తీసుకుంటామని ప్రస్తుతానికి టెండర్లు వేయాలని పాలకవర్గ సభ్యులు సూచించటంతో ట్రేడర్స్ టెండర్లు వేయటంతో యథావిధిగా లావాదేవీలు మొదలయ్యాయి. ఏదిఏమైనా ఇప్పటికే 50 కిలోల బస్తాకు 49 కిలోలు మాత్రమే తూకం చేస్తున్న పరిస్థితిలో మరో 1300 గ్రాముల అధిక తూకం వేస్తే మరింత నష్టపోయే పరిస్థితి ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఆకస్మాత్తుగా తూకాలను గురించి టెండర్ల ప్రక్రియను నిలిపివేస్తే మార్కెట్‌కు వివిధ గ్రామాల నుంచి పంట తెచ్చిన రైతుల పరిస్థితి ఏమిటని పలువురు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఈ విషయంపై సంబంధిత అధికారులు దృష్టి సారించి రైతులకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



ఆందోళన చేస్తున్న రైతులతో మాట్లాడుతున్న పాలకవర్గసభ్యులు

# గంగ బెంగ



యాసంగి పంటలకు సాగునీటి కష్టాలు మొదలయ్యాయి. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని పలు ప్రాంతాల్లో వేసవిలో సాగు, తాగునీటి ఎద్దడి తీవ్రమైంది. చెరువులు, కుంటలు అడుగంటగా.. కాల్వలు నీళ్లులేక వెలవెలబోతున్నాయి. బోరుబావుల్లో భూగర్భ జలాలు గణనీయంగా పడిపోయాయి. దీనికి తోడు పలు చోట్ల కరెంట్ సమస్యలు వేధిస్తుండడంతో రైతుల బాధలు వర్ణణాతీతం. రెక్కలు ముక్కలు చేసుకొని.. వేల రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన పంటలు కండ్ల ముందే తడారుతుంటే చూసిన కర్షకుల గుండె బరువెక్కుతున్నది.

– నెట్‌వర్క్ మహబూబ్‌నగర్, ఏప్రిల్ 7

## రోజుకు మూడు ట్యాంకర్ల చొప్పున..

- **వరిని కాపాడేందుకు రాత్రి, పగలు రైతు తాపత్రయం**

చారకొండ, ఏప్రిల్ 7 : మండల కేంద్రానికి చెందిన రైతు గుండె శ్రీనుగౌడ్ తనకున్న రెండెకరాలలో వరి పంట సాగు చేశాడు. పంట బాగా పెరిగే సమయానికి భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. దీంతో ఉన్న బోరులో నీటిమట్టం గణనీయంగా తగ్గిపోయింది. గతంలో రెండు పంటలు సా గుచేసేటోడిని.. ఈ ఏడాది వరి మాత్రమే సాగు చేసినా నీళ్లు అందుతలేవు. ప్రస్తుతం వరి పొట్ట దశలో ఉండగా.. నీళ్లులేక ఎకరం ఎండిపోయింది. మిగిలిన పంటను కాపాడుకునేందుకు నిత్యం మూడు ట్యాంకర్ల వరకు నీటిని తెచ్చి పంటకు నీరందిస్తున్నాడు. ఒక్కో ట్యాంకర్‌కు రూ.1500 వరకు కొనుగోలు చేయాల్సి వస్తుందని సదరు రైతు వాపోతున్నాడు. ప్రభుత్వం స్పందించి నష్టపోయిన పంట వివరాలు సేకరించి పరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరారు.



చారకొండలో పంటకు ట్యాంకర్‌తో నీరు పడుతున్న రైతు

## కౌలు రైతు కలవరం

ధన్వాడ, ఏప్రిల్ 7 : మణిపూర్ తండాకు చెందిన రైతు టీక్యానాయక్ తన పొలంతోపాటు అప్పంపల్లికి చెందిన మరో రైతు రామకృష్ణారెడ్డికి చెందిన 8 ఎకరాలను కౌలు తీసుకొని వరి సాగు చేశాడు. మరో 10 రోజుల్లో పంటలు చేతికొచ్చే దశలో ఉండగా.. మూడు బోర్లలో నీళ్లు రావడం లేదు. ఒక్కసారిగా భూగర్భ జలాలు అడుగంటడంతో సాగునీరు అందని పరిస్థితులు తలెత్తాయని రైతు లబోదిబోమంటున్నాడు. కౌలుకు ఎకరాకు రూ.10వేలతోపాటు పంట పెట్టుబడికి రూ.6 లక్షల వరకు నష్టపోయినట్లు వాపోయారు. పంటను కాపాడుకునేందుకు సొంతంగా బోరువేసినా చుక్క నీరు పడలేదన్నాడు. గతేడాది బోర్లలో నీరు పుష్కలంగా ఉండేదని, ఈసారి సాగునీటి కష్టాలు మొదలయ్యాయని ఆందోళన చెందాడు. నాకు రుణ మాఫీ కూడా కాలేదని బోరుమన్నాడు.



మణిపూర్ తండాలో పశువులు మేస్తున్న వరి, (ఇన్‌సెట్లో) రైతు టీక్యా



జూరాల ఎడమ కాల్వలో ట్రాక్టర్ సాయంతో నీటిని తోడుతున్న దృశ్యం

## రైతన్నకు క'న్నీటి' కష్టాలు

పెబ్బేరు, ఏప్రిల్ 7 : జూరాల ప్రధాన ఎడమ కాల్వ పరిధిలో సాగు చేసిన యాసంగి పంటలకు సంకట స్థితి తలెత్తింది. వరి పంట చివరి దశలో ఉండగా.. నీరందని పరిస్థితి ఏర్పడింది. మరో రెండు, మూడు తడులకు నీరు అవసరముండగా.. అప్పుడే కాల్వలో నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎలాగైనా పంటలను గట్టెక్కించాలన్న తాపత్రయంతో కొందరు రైతులు భగీరథ ప్రయత్నాలు చేస్తున్నారు. మండలంలోని తోమాలపల్లె వద్ద జూరాల ప్రధాన ఎడమ కాల్వ నీరు లేక వెలవెలబోతున్నది. అడుగు భాగాన ఉన్న కొద్దిపాటి నీటిని పారించేందుకు రైతులు తండ్లాడుతున్నారు. ఓ ట్రాక్టర్‌కు మోటార్లు బిగించి పైపుల ద్వారా పంట కాల్వలకు తోడి పోస్తున్నారు.

## అడుగంటుతున్న ఆశలు

- **పడిపోతున్న భూగర్భ జలాలు**
- **20 మీటర్ల లోతులో నీటిమట్టం**

గండీడ్, ఏప్రిల్ 7 : భూగర్భ జలాలు అడుగంటుతుండడంతో రైతుల ఆశలు ఆవిరవుతున్నాయి. దీంతో యాసంగిలో సాగైన పంటలకు గడ్డుకాలం దాపురించింది. గండీడ్ మండలంలోని 27 గ్రామాలలో దాదాపు 7,200 ఎకరాలలో వరి పంటలు సాగయ్యాయి. అయితే జలం పాతాళానికి పడిపోవడంతో సాగునీటికి ఢోకా ఏర్పడింది. దాదాపు 20 మీటర్ల లోతుకు నీటిమట్టం పడిపోయినట్లు అంచనా.. బోరుబావులు వట్టిబోయి నీళ్లు అందక దాదాపు 200 పైచిలుకు ఎకరాల్లో వరి ఎండిపోయింది. మండలంలోని వెన్నాచేడ్, సాలార్‌నగర్ ప్రాజెక్టులతో పాటు 10 నోటిఫైడ్ చెరువులు ఉన్నాయి. అయితే అన్ని గ్రామాలలో దాదాపు 10 నుంచి 20 ఎకరాల వరకు పంటలు ఎండిపోయినట్లు తెలుస్తున్నది. అయితే వ్యవసాయ అధికారుల లెక్కలు మాత్రం ఇందుకు భిన్నంగా ఉన్నాయి. వరి 7,200 ఎకరాల్లో ఉండగా.. కేవలం 85 ఎకరాలు మాత్రమే ఎండిపోయిందని వారు చెబుతున్నారు. ఇలా తప్పుడు లెక్కలు చూపడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతుకు కన్నీటి కష్టాలు మొదలయ్యాయి. గతేడాది కంటే ఈసారి ఫిబ్రవరి మొదట వారంలోనే భూగర్భ జలాలు ఇంకిపోయాయి. రోజురోజుకూ గణనీయంగా పడిపోతుండడంతో రైతులు కొత్తగా బోర్లు డ్రిల్లింగ్ చేయిస్తున్నా.. ఎక్కడో ఒక చోట మాత్రమే నీళ్లు పడ్తున్నాయి. నీళ్లు అందక ఎండిపోయిన పంటను చేసేది లేక పశువులకు మేతగా వదిలేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందించాలని పలువురు రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.





బల్సూర్‌కొండలో ఎండిపోయిన వరిని చూపుతున్న రైతు రాజిరెడ్డి, లింగాయిపల్లి లో ఎండిన పంటను చూపిస్తున్న రైతు దోమ గోపాల్

## రోజుకు 4 నుంచి 6 ట్యాంకర్ల నీటితో..

- **పంటను కాపాడుతున్న హన్వాడ రైతు**

హన్వాడ, ఏప్రిల్ 7 : భూగర్భ జలాలు ఇంకిపోయి పంటలు చేతికొచ్చే సమయంలో పంటలు ఎండిపోతుంటే రైతు గుండె తరుక్కుపోతున్నది. పంటలను ఎలాగైనా కాపాడుకోవాలని విశ్వప్రయత్నాలు చేస్తున్నాడు. సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండల కేంద్రం శివారులో రైతులు శ్రీనివాసులు, అక్బరయ్య, బాలయ్యకు చెందిన వరి పంట ఎండుముఖం పట్టింది. మరో 15 రోజుల్లో కోతకొచ్చే సమయంలో సాగునీరు లేకపోవడంతో పంటను కాపాడుకోవడానికి రైతు శ్రీనివాస్ ట్యాంకర్ ద్వారా నీటిని అందిస్తునానడు. ఒక్క వాటర్ ట్యాంకర్‌కు రూ.600 చెల్లించి చెల్లించి రోజుకు నాలుగు నుంచి ఆరు ట్రిప్పుల నీళ్లు పంటకు పారబెడుతున్నాడు.



# బాజాప్తా రుణమాఫీ చేయాల్సిందే..

- **పెంట్లవెల్లి తాసీల్దార్ కార్యాలయం ఎదుట రైతుల ధర్నా**
- **నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ వద్ద ప్లకార్డులతో నిరసన**

నాగర్‌కర్నూల్/పెంట్లవెల్లి, ఏప్రిల్ 7 : కొల్లాపూర్ నియోజకవర్గంలో రైతుల తిరుగుబాటు మొదలైంది. తీసుకున్న రుణాలు మాఫీ కాకపోవడంతో ఆగ్రహించిన రైతులు కలెక్టరేట్‌ను ఆశ్రయించిన ఘటన సోమవారం జిల్లాలో చోటు చేసుకున్నది. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గంలోని పెంట్లవెల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సభ్యులుగా ఉన్న 499మంది రైతులు 12/12/2018 నుంచి 09/12/2023 మధ్యకాలంలో సంఘం నుంచి రుణాలు తీసుకున్నారు. అయితే ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన రుణమాఫీలో సదరు రైతులకు చెందిన రుణాలు మాఫీ కాలేదు. దీంతో ఆగ్రహించిన రైతులు గత రెండు నెలలుగా నిరసనలు, ఆందోళనలు చేపడుతూనే ఉన్నారు. ఇందులో భాగంగానే సోమవారం మరోసారి రైతులు నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌కు చేరుకొని ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తాము తీసుకున్న రుణాలను వెంటనే మాఫీ చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం ప్రకటించిన మూడు విడుతల రుణమాఫీలో రూ.10వేల నుంచి లక్ష వరకు ఏ ఒక్కరి రుణం కూడా మాఫీ కాకపోవడంతో తాము తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నామని రైతులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. పెంట్లవెల్లి పీఏసీసీఎస్ నుంచి తీసుకున్న 499 మందికి చెందిన రుణాలు మాఫీ కాకపోవడానికి గల కారణాలపై విచారణ జరిపి తమకు రుణం మాఫీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంతోష్‌కు ఇచ్చిన వినతిపత్రంలో కోరారు. అంతకుముందు కలెక్టరేట్ గేటు ముందు ప్లకార్డులతో నిరసన తెలిపారు. నాలుగో విడుతతో కలిపి మొత్తం రుణాన్ని మాఫీ చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పెంట్లవెల్లి పీఏసీసీఎస్‌కు పరిధిలోని రైతులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అంతకు ముందు పెంట్లవెల్లి సొసైటీలో రైతులకు రుణమాఫీ వర్తింప చేయాలని కోరుతూ పెంట్లవెల్లి సొసైటీ పరిధిలోని కొండూరు, మల్లేశ్వరం, మంచాలకట్ట, మాధవస్వామినగర్, ఎంగంపల్లితండా, రామాపురం, సోమశిల గ్రామాలకు చెందిన 150మంది రైతులు సోమవారం పెంట్లవెల్లి తాసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ధర్నాకు పీఏసీసీఎస్ చైర్మన్ విజయరామారావు, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పోతుల వెంకటేశ్వర్లు తదితరులు మద్దతు తెలిపారు. అనంతరం తాసీల్దార్ జయసింహకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన రైతులు అబ్దుల్‌హుస్సేన్, నర్సింహ, రాంచందర్, తిరుపాలు, జ్ఞానేశ్వర్, బాలస్వామి, నాగశేషి, వల్లయ్యలతోపాటు దాదాపు 150మంది రైతులు పాల్గొన్నారు.



పెంట్లవెల్లిలో తాసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న రైతులు

# జీవో నెం.21 వెనక్కి తీసుకోవాలి

- **జీవో ప్రతులు దహనం చేసిన ఒప్పంద అధ్యాపకులు**

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, ఏప్రిల్ 7 : జీవో నెం.21 వెంటనే వెనక్కి తీసుకోవాలని పాలమూరు యూనివర్సిటీ ఒప్పంద అధ్యాపకులు డిమాండ్ చేశారు. సోమవారం పీయూ పరిపాలన భవనం ఎదుట పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. ప్రభుత్వ జీవో ఉత్తర్వు జిరాక్స్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం యూనివర్సిటీల్లో సహాయ ఆచార్యుల నియామకం కోసం విడుదల చేసిన జీవో నెంబర్ 21ను తక్షణమే రద్దు చేయాలన్నారు. ఈ మేరకు వీసీ శ్రీనివాస్, రిజిస్ట్రార్ రమేశ్‌బాబును కలిసి ఒప్పంద అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాకే మిగిలిన పోస్టులను నియమించాలని వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎన్నో ఏండ్లుగా యూనివర్సిటీని నమ్ముకొని పనిచేస్తున్నామని, జూనియర్ లెక్చరర్లు, డిగ్రీ లెక్చరర్లను క్రమబద్ధీకరించినట్లే యూనివర్సిటీ ఒప్పంద అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఒప్పంద అధ్యాపకుల సంఘం నాయకులు భూమయ్య, రవికుమార్, శ్రీధర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, వెంకటేశ్, కరుణాకర్‌రెడ్డి, రవికాంత్, విజయ్‌భాస్కర్, సోమేశ్వర్, శ్రీనివాస్, జంగం విశ్వనాథ్, బషీర్ అహ్మద్, ఆంజనేయులు పాల్గొన్నారు.



ప్రతులు చించివేస్తున్న అధ్యాపకులు

# మా డబ్బులు మాకు ఇప్పించండి

- **అచ్చంపేట ఎస్బీఐ మేనేజర్‌ను నిలదీసిన ఖాతాదారులు**

అచ్చంపేటరూరల్, ఏప్రిల్ 7 : ఎస్బీఐలో ఏడాదిన్నర కిందట 21 మంది ఖాతాదారులు రూ.1.50 కోట్ల డబ్బును డిపాజిట్ చేయగా మూడో కంటికి తెలియకుండా బ్యాంక్‌లో పనిచేసే క్లర్క్ కిరణ్‌కుమార్ వాటిని కాజేసి కుటుంబ సభ్యుల ఖాతాల్లో మళ్లించుకున్నారు. వాటిని బ్యాంక్ అధికారులు తిరిగి ఇవ్వాలని సోమవారం ప్రస్తుత బ్యాంక్ మేనేజర్ హుస్సేన్‌బాషాను ఖాతాదారులు నిలదీశారు. ఖాతాదారులు మొకురాల మోహన్‌గౌడ్, సునంద, అనిత, లింగారెడ్డి, బందగి, నరేందర్, వెంకట్‌రెడ్డి, మల్లేశ్, శేఖర్, హసీనాల కథనం మేరకు తాము బ్యాంక్‌పై నమ్మకంతో డిపాజిట్‌గా ఖాతా లో డబ్బులు దాచుకోగా ఇదే బ్యాంక్‌లో క్లర్క్‌గా పనిచేసే కిరణ్ కుమార్ తమకు ఎటువంటి సమాచారం లేకుండా 2023లో 21మంది ఖాతాల నుంచి అక్రమంగా డబ్బులు తమ బంధువులు, మిత్రుల పేరిటా బదలాయించుకొని తమను మోసం చేశారని ఆరోపించారు. అతనిని సస్పెండ్ చేసి పోలీసులు కేసు నమోదు చేసినా తమకు రావాల్సిన డబ్బులు ఇప్పటికీ ఇవ్వలేదన్నారు. ఐదు విడుతలుగా ఎంక్వైరీలు నిర్వహించినా తమ ఖాతాలో డబ్బులు జమ చేయలేదని వాపోయారు. ఈ విషయంపై బ్యాంక్ మేనేజర్ హుస్సేన్ బాషాను వివరణ కోరగా 21మంది డిపాజిట్ చేసిన రూ.1.50 కోట్లను ఏప్రిల్ నెలాఖరులోగా ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

# కమీషన్ కోసం పనులు అడ్డుకున్న కాంగ్రెస్ నేత

అమరచింత, ఏప్రిల్ 7 : కాంగ్రెస్ నేతలు కమిషన్ల కో సం పనులను అడ్డుకుంటున్నారని బీఆర్‌ఎస్ నాయకుడు, మాజీ కౌన్సిలర్ లెనిన్ ఆరోపించారు. సోమవారం వీటికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. అమరచింత మున్సిపాలిటీ పరిధిలోని ఐదో వార్డులో భగత్‌సింగ్ విగ్రహం నుంచి తాసీల్దార్ కార్యాలయానికి వెళ్లే దారిలో చాలా చోట్లా విద్యుత్ తీగ లు కిందకు వేలాడుతున్నాయి. వీటిని సరి చేయాలని లేదంటే ప్రజ లు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని విద్యుత్ అధికారులకు విన్నవించడంతో స్పందించిన ఏఈ సోమవారం వాటిని సరి చేసేందుకు మెటీరియల్‌తోపాటు సిబ్బందిని పంపించారు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అరుణ్‌కుమార్ విద్యుత్ సిబ్బందిని పోలీస్‌స్టేషన్ సమీపంలో అడ్డుకొని కమీషన్ కోసం విద్యుత్ అధికారులకు ఫోన్ చేసి వారి ని తిప్పి పంపించారని ఆరోపించారు. తన స్వా ర్థం కోసం ప్రజ ల ఇబ్బందులను గాలికి వదిలి అభివృద్ధి పనులను అడ్డుకుంటున్న తీరుపై మక్తల్ ఎమ్మెల్యే స్పందించాలని విజ్ఞప్తి చేశారు. అంతకు ముందు ఈ విషయాన్ని సోషల్ మీడియాలో సైతం పోస్టు పెట్టడంతో వైరల్‌గా మారింది. ఈ విష యంపై విద్యుత్ ఏఈ సుమన్‌ను వివరణ కోరగా అక్కడ స్తంభాలు ఏర్పాటు చేసేందుకు సర్వే చేశామని, ఆ సర్వే తప్పుగా ఉందని తెలియడంతో పనులు నిలిపి వేశామని మరో రెండు రోజుల్లో స్తంభాలను ఏర్పాటు చేస్తామని పొంతన లేని సమాధానం ఇస్తున్నారు. ఏదిఏమైనా కమీషన్లకోసం అభివృద్ధి పనులను అడ్డుకోవడం సరికాదన్నారు.